కలెక్టర్ వినోద్‌కుమార్

ఎస్పీ అమిత్ బర్దార్

కలెక్టర్, ఎస్పీ నియామకం

◆ కలెక్టర్‌గా వినోద్‌కుమార్, ఎస్పీగా అమిత్ బర్దార్

◆ బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ◆ నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్‌గా డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీగా అమిత్ బర్దార్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం సాయంత్రమే జిల్లా ఎస్పీగా అమిత్ బర్దార్ బాధ్యతలు చేపట్టారు. వినోద్ కుమార్ శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతకు మునుపున్న కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌ను ఎన్నికల సంఘం బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ఇద్దరినీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అనంత అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ వినోద్ కుమార్

2015 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ వినోద్ కుమార్ కొంతకాలం అసిస్టెంట్ కలెక్టరుగా అనంతలో పనిచేశారు. ప్రస్తుతం ఆయన స్కిల్‌డెవలప్‌మెంట్ సిఇఒగా పనిచేస్తున్నారు. అంతకు మునుపు తూర్పుగోదావరి జిల్లాలో హెల్త్ విభాగంలో పనిచేశారు. ఆయన్ను ప్రస్తుతం అనంతపురం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. వెంటనే బాధ్యతలు చేపట్టాలని పేర్కొనడంతో విజయవాడ నుంచి వచ్చి శుక్రవారం రోజు బాధ్యతలు చేపట్టనున్నారు. వినోద్‌కుమార్ తొలిసారిగా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మకమైన అనంతపురం జిల్లాలో ఏ మేరకు నెట్టుకురాగలరన్నది చూడాల్సి ఉంది.

ఎస్పీగా అమిత్ బర్దార్

అనంతపురం ఎస్పీగా అమిత్ బర్దార్ నియమితులయ్యారు. అనంతపురం ఎపి ఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా అమిత్ బర్దార్ పనిచేస్తున్నారు. అంతకు మునుపు ఆయన సిఐడి ఎస్పీగా పనిచేశారు. 2019 ముందు శ్రీ కాకుళం ఎస్పీగా పనిచేశారు. ఇప్పుడు ఆయన్ను జిల్లా ఎస్పీగా నియమించారు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే సాయంత్రం ఆయన ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరు కొత్తవారే..

జిల్లా కలెక్టర్, ఎస్పీ ఒకేసారి మార్పు జరగడంతో ఇద్దరూ కొత్త అధికారులే ఆ బాధ్యతల్లోకి వచ్చారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో అనేక లోపాలున్నాయి. అవే గత కలెక్టర్ ఎం.గౌతమిపై వేటుకు కారణమయ్యాయి. కొత్త కలెక్టర్ వీటిని ఏ రకంగా సరిచేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే సమస్యాత్మకమైన అనంతపురం జిల్లాలో ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ కత్తి మీద సామే అవుతుంది. ఇప్పటికే ఎప్పుడూ సమస్యాత్మకంగా ఉండే నియోకవర్గాలు ప్రాంతాలున్నాయి. ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు ఏ రకంగా తీసుకోగలరన్నది చూడాల్సి ఉంది. సమయం కూడా చాలా తక్కువగా ఉండటంతో వీటన్నింటిని సమన్వయం చేయడం ఇద్దరికీ పెద్ద సవాల్‌గానే మారనుంది.

సార్వత్రిక ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుతోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ప్రకటనతో వారంతా ప్రచారాల్లో మునిగిపోయారు. సుర్రున మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి మునుపే ఓ విడత ప్రచారాలు ముగించేయాలన్న భావనతో కాలికిబలపం కట్టుకుని తిరుగుతున్నారు. గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇదే సమయంలో అభ్యర్థులకు అసమ్మతి నేతల భయం పట్టుకుంది. ఒకటి రెండు మినహా మిగిలిన అన్ని చోట్లా ప్రధాన పార్టీలకు అసమ్మతి సెగ చుట్టుకుంది. దీంతో అభ్యర్థులు వారిని మచ్చిక చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు.

పగలు ప్రచారాలు.. రాత్రి బుజ్జగింపులు..!



◆ గెలుపుకోసం అభ్యర్థుల పాట్లు

◆ అసమ్మతి నేతలతో మంతనాలు

◆ కలిసి పనిచేసేలా రాయబారాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసింది. కాగా టిడిపి, వైసిపిలో అభ్యర్థుల ప్రకటన తర్వాత అసమ్మతి రాగాలు వినిపిస్తున్నాయి. ఇందులో కొన్ని బహిర్గతం అవుతుండగా మరికొన్ని లోలోపలే జరుగుతున్నాయి. రెండు, మూడు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని చోట్లా అసమ్మతి సెగలు ఉన్నాయి. టిడిపి విషయానికి వస్తే కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం అర్బన్, మడకశిర, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పరిస్థితి ఎక్కువగా ఉంది. శింగనమల, పెనుకొండ, నియోజకవర్గాల్లో అసమ్మతి ఉన్నా అధిష్టానం సూచనతో అవి సర్దుమనిగాయి. ఇక వైసిపిలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, కదిరి, పెనుకొండ నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఇప్పటికే రెండు పార్టీల నేతలు అటు నుంచి ఇటు పార్టీ కండవాలు మార్చేస్తున్నారు. ఇలాంటి సమయంలో అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలను చేస్తున్నారు.

ఉదయం ప్రచారాలు

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా అభ్యర్థులు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఉదయం 8గంటల కల్లా ప్రచారంలోకి దిగుతున్నారు. ఆయా ప్రాంతాల నేతలను వెంటబెట్టుకని అభ్యర్థులు ఓటర్లను కలుస్తున్నారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిసి ఓట్లు అడుగుతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో సభలను నిర్వహించి వారి పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

అంతర్గత సమావేశాలు.. బుజ్జగింపులు..

ప్రచారంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో అసమ్మతి నేతలను కలిసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అధికారం వస్తే న్యాయం చేస్తామంటూ వారికి హామీనిచ్చి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను రాష్ట్ర నాయకులు పిలిచి మాట్లాడుతున్నారు. అలక వహించిన నేతల కోర్కెలన్నింటినీ తీరుస్తామనేలా అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. అందరినీ సమన్వయం చేస్తూ గెలావలనే భావనలో నాయకులు ఉన్నారు. అయితే కొన్ని చోట్ల అసమ్మతి నాయకులు దారికొస్తుండగా, మరికొన్ని చోట్ల సహకరించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. ఇలాంటి చోట అభ్యర్థులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ గ్రామం లేదా వార్డులో ప్రత్యర్థి పార్టీలో బలమైన నేతను తమ వైపునకు తిప్పుకునేలా పావులు కదుపుతున్నారు. ఇలా ఉదయం ప్రచారం రాత్రి బుజ్జగింపులతో ప్రచారాలు జరుగుతున్నాయి. నామినేషన్లు వేసేలోగా అసంతృప్తులను దారికి తెచ్చుకోవాలనేలా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సదస్సులతో సరికొత్త ఆలోచనలకు నాంది

జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలుకుతాయని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ మెర్జ్-2కె 24 అనే జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు నాంది అవుతాయన్నారు. విద్యార్థులు తమ తమ చిన్న ఆలోచనలే రేపటి రోజున గొప్ప విషయాలకు నాంది పలుకుతాయన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. విఎల్‌ఎస్‌ఐ, ఎంబెడెడ్ సిస్టం, పవర్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ విభాగాలు ముఖ్య పాత్ర పోసిస్తున్నాయన్నారు. రాబోవు కాలంలో ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్ రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. గౌరవ అతిథి మనోహర్ చేనేకల్, సీనియర్ ఇంజినీర్ లీడర్, జెడ్ ఎఫ్ కమర్షియల్ వెహికల్ సొల్యూషన్స్ లిమిటెడ్, హైదరాబాద్ (కళాశాల పూర్వ విద్యార్థి) మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్, ఇండస్ట్రీల మధ్య సంబంధాలను మెరుగు పరుచుకుంటే విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ప్లేస్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకుని గొప్ప కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ, ఇసిఇ విభాగాధిపతి జి.మమత, కోఆర్డినేటర్ డి.లలితకుమారి, ఆచార్యులు వి.సుమలత, పి.రమణారెడ్డి, భువనవిజయ, కెఎఫ్.భారతి, ఎ.పి.శివకుమార్, డి.విష్ణువర్ధన్, ఎం.రామశేఖర్‌రెడ్డి, కల్యాణి రాధ, ఆజిత, మాజీ ఆచార్యులు ఎం.ఎన్.గిరిప్రసాద్, స్టూడెంట్ కోఆర్డినేటర్ జాకీర్‌హుసేన్, వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర, ఎలక్ట్రానిక్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు

చైన్ స్నాచర్ల అరెస్టు

12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

నిందితుల్లో ఆర్మీ జవాను

ఇన్‌ఛార్జి ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి

పట్టుబడిన బంగారు ఆభరణాలను చూపుతున్న ఇన్‌ఛార్జి ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

చైన్ స్నాచింగులకు పాల్పడే ముగ్గురు నిందితులను జిల్లా స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్ పోలీసులతో కలిసి గార్లదిన్నె, అనంతపురం రూరల్ పోలీసులు వేర్వేరుగా అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానికా కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎస్పీ వెల్లడించారు. అనంతపురం సీసీఎస్, గార్లదిన్నె పోలీసులు కలిసి కంబదూరు మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఎనుముల మారుతీప్రసాద్, మూడవత్ రామ్లునాయక్‌ను అరెస్టు చేసి 3 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు వ్యసనాలకు అలవాటు పడి చైన్ స్నాచింగులకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. వీరిపై ఏడాదిన్నర కాలంలో అనంతపురం 2టౌన్, 3 టౌన్, తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్నాటక రాష్ట్రం బళ్లారి, సింధనూరు, తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. వీరిని సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్ధన్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గార్లదిన్నె సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు.

అలాగే నార్పల మండలం కేసేపల్లికి చెందిన ఇండియన్ ఆర్మీ జవాన్ వేణును అరెస్టు చేసి 9తులాల బండారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆర్మీ జవాన్ గా పని చేస్తున్న వేణు సెలువుపై అనంతపురం వచ్చి క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి వ్యసనాలకు ఆలవాటు పడి అప్పులు చేశాడు. దీంతో సులభంగా డబ్బులు సంపాధించాలన్న ఆలోచనతో ఊరి బయట జనసంచారం లేనిచోట మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగులకు పాల్పడేవాడు. ఇందులో భాగంగా అనంతపురంతో పాటు కురుగుంటలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిఘా వేసిన జిల్లా స్పెషల్ బ్రాంచి, సిసిఎస్ పోలీసులు అనంతపురం డీఎస్పీ బి.వి.శివారెడ్డి పర్యవేక్షణలో రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ప్రసాద్, రాంమోహన్‌రెడ్డి, రాజశేఖర్ బృందంగా ఏర్పడి నిందితుడిని కట్టకిందపల్లి సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందుతులను అరెస్టు చేయడంతో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

నిత్యావసరాల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం : ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్) కి లోబడి ఇంటింటికి నిత్యవసరాల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. గురువారం అనంతపురంలోని రూరల్ ఎంపిడిఒ కార్యాలయం దగ్గరలోని నవోదయ కాలనీకి వెళ్లే రహదారి వద్ద ఉన్న 80 ఫీట్ రోడ్డులో ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండియు వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ నిత్యవసర సరుకుల కింద ప్రస్తుతం బియ్యం, చక్కర, రాగులు, జొన్నలు, మున్సిపాలిటీలో గోధుమపిండి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాగిపిండి, జొన్నలు నాణ్యతగా ఉన్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్యావసర సరుకులు ఇంటింటికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శోభారాణి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం వెళ్లి

అస్వస్థతకు గురైన ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పింఛన్ కోసం వెళ్లి అస్వస్థతకు గురై ఇద్దరు వృద్ధులు గురువారం ఉదయం మృతి చెందారు. ఈ ఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఆయా కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రి మండలం చిన్నపడమల గ్రామానికి చెందిన ఆదెమ్మ(70) పింఛను తీసుకునేందుకు బుధవారం మధ్యాహ్నం సచివాలయానికి వెళ్లింది. అక్కడ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పింఛన్ కోసం వేచి చూసి అస్వస్థకు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆదెమ్మ మృతి చెందింది. తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన హుస్సేన్‌మియా(72) పింఛన్ కోసం బుధవారం ఉదయం సచివాలయం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వస్తుండగా ఎండవేడిమికి కళ్లు తిరిగి కింద పడ్డాడు. కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం ఆయన్ను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం హుస్సేన్‌మియా మరణించాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

దగ్గుపాటి ప్రసాద్ ఎన్నికల ప్రచారం ప్రారంభం

◆ తోడుగా నిలిచిన సీనియర్ టిడిపి నేతలు ◆ ఘన స్వాగతం పలికిన తెలుగుదేశం శ్రేణులు

అనంతపురంలో ప్రచారం చేస్తున్న దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో తెలుగుదేశం శ్రేణులు ఈయనకు ఘనస్వాగతం పలికారు. అనంతపురం నగరంలోని పాతూరు కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడే ఉన్న చౌడేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దగ్గుపాటి ప్రసాద్‌కు పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు తరలివచ్చి గజమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. టిడిపి సీనియర్ నాయకులు, ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆసించిన ఆశావహులు సైతం దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు మద్దతుగా నిలిచి ప్రచారం నిర్వహించారు. గుత్తి రోడ్డులో ఉన్న 10వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి భవాని రవికుమార్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ జెఎల్.మురళీ, మాజీ మేయర్ స్వరూప ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. వీరంతా ఇంటింటీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు అందజేస్తూ ఓటు అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచాక నగరాన్ని రాష్ట్రంలో అగ్రగామిగ తీర్చిదిద్దేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. పరిశ్రమల తీసుకొచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్య పరిష్కారం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చిన్నచిన్న విబేధాలు ఉన్నా వాటిని పరిష్కరించుకుని ముఉందుకు సాగుతామని తెలియజేశారు. ఈ ప్రచారంలో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జెఎల్.మురళీధర్, బుగ్గయ్య చౌదరి, చంద్రదండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, నాయకులు సుధాకర్ నాయుడు, కొండవీటి భావన, మాజీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, ఎన్‌బికె ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు మార్కెట్ శ్రీధర్, టిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు వెంకటప్పతో పాటు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దగ్గుపాటికి వైకుంఠం జయచంద్ర చౌదరి మద్దతు

అనంతపురం నగరంలో గత 40ఏళ్లుగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఉన్న వైకుంఠం జయచంద్ర చౌదరి టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కు మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సోదరుడైన జయచంద్ర చౌదరిని గురువారం నాడు అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. దీనిపై జయచంద్ర చౌదరి స్పందిస్తూ తాను ఇన్ని రోజులు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఉన్నానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి తనవంతు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు కూడా దగ్గుబాటికి సహకారం అందిస్తామని చెప్పారు.

జగనాసురుడిని ఇంటికి పంపేందుకు జనం 'సిద్ధం'

టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో రాక్షసపాలన సాగిస్తున్న జగనాసురుడిని ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి జయరాం అన్నారు. గురువారం కసాపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో టిడిపి, బిజెపి, జనసేన ప్రధాన నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో చేస్తున్న అరాచక పాలన నచ్చక తాను మంత్రి పదవితోపాటు పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా గుంతకల్లు ఎమ్మెల్యే టికెట్టు కేటాయింపుపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను అలాంటి వ్యక్తిని కాదని, అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానన్నారు. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న నేను అందరి సహకారంతో గెలుపు సాధిస్తామన్నారు. జగనాసురుడిని గద్దె దింపేందుకు ముగ్గురు త్రిమూర్తులు (మోడీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్) ఏకం అయ్యారన్నారు. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్థానిక 1వ వార్డు వైసిపి కౌన్సిలర్ ఉడదాల ప్రభాకర్ టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గుమ్మనూరు జయరామ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, సీనియర్ నాయకుడు కేసి.హరికుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు పశుపుల హరిహరనాథ్, నాయకులు శేకన్న, జనసేన నియోజకవర్గ కన్వీనర్ వాసగిరి మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే లక్ష్యం

గుత్తి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఆసన్నమైందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల అభిమానం ఎనలేనిదన్నారు. అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టబోతున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పదవులు శాశ్వతం కాదని, ఊపిరి ఉన్నంత వరకూ మంచితనమే ఉంటుందన్నారు. తనకు పదవి ఉన్న సామాన్యుడు గానే మెలుగుతానన్నారు. తనపై వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, టిడిపి మండల కన్వీనర్ బర్దివలి, నాయకులు కెసి.హరి, బండారు ఆనంద్, రామన్నచౌదరి, పి.నారాయణస్వామి, పి.రవితేజ, పిల్లెల్లి కృష్ణయ్య, పి.ప్రభాకర్, పి.సుధాకర్, జక్కలచెరువు గోవింద, ప్రతాప్, శ్రీనివాస్‌చౌదరి, సుధాకర్‌నాయుడు, కె.గోవిందు, ఎస్ఎం.బాషా, వెంకటనారాయణ, వెంకటస్వామి, లక్ష్మీనారాయణమ్మ, తపిల సుధాకర్, ఎన్.జయన్న, న్యాయవాది సోము, తదితరులు

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉద్యానవన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ

మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ

ప్రజాశక్తి-బెలుగుప్ప

మామిడి పంటను సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ సూచించారు. మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతులు సాగుచేసిన మామిడి తోటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏప్రిల్‌లో మామిడి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ముఖ్యంగా కాయ కోతకు 30-40 రోజుల ముందు నీరు పెట్టడం ఆపితే కాయ నాణ్యత పెరుగుతుందన్నారు. పండు ఈగ ఆశించే తోటల్లో 2 మి.లీ మలాథియాన్, 2 మిలీ మిథైల్ యుజినాల్ లీటర్ నీటికి కలిపి ఎర ద్రావణం తయారు చేసుకుని ఒక్కొక్క ప్లాస్టిక్ పళ్లెంలో 250 మి.లీ పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలన్నారు. వేప గింజల కషాయం 5 శాతం ప్రతి 10 రోజులకు ఒకసారి ఏప్రిల్ మే నెల వరకూ అనగా మామిడి పండ్లకోతకు 15 రోజుల ముందు వరకు పిచికారీ చేయాలన్నారు. చల్లటి వేళల్లో మాత్రమే కాయల్ని కోయాలన్నారు. కాయలను 5-7 సెం.మీ తొడిమతో కోసి పూర్తిగా సొన కారేవరకూ తలకిందులుగా ఉంచి కాయలకు సొన అంటకుండా జాగ్రత్త పడాలన్నారు. దూరప్రాంత రవాణా కోసం కాయలను కోసిన 10 గంటల లోపల శీతల గిడ్డంగులలో (12.5డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 80-90 శాతం తేమ వద్ద) నిల్వ ఉంచాలన్నారు. కాయ కోత అనంతరం చెట్టుకు 15 రోజుల విశ్రాంతి ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టాలి సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' అభివృద్ధిలో భాగస్వాములు కండి

అనంత వెంకటరామిరెడ్డి



పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 5వ డివిజన్ పరిధిలోని ఖాజానగర్‌లో కమ్యూనిస్టు గోపాల్ తనయుడు ఉదయ్‌తోపాటు పలు కుటుంబాలు గురువారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అంటేనే ఒక నమ్మకమన్నారు. సీఎం జగన్ అంటే ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. ఎందుకంటే అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ప్రజాసంక్షేమం గురించి ఆలోచించి ఎన్నో పథకాలను తీసుకొచ్చిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పథకాలు అందే పరిస్థితి ఉండేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కులం, మతం, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా అనంతపురం నగరాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కాఫుజ్ గర్ రిజ్వాన్, జయలలిత, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, మధు సూదన్‌గౌడ్, రమణారెడ్డి, కార్పొరేటర్లు అబుసులేహా, అనిల్ కుమార్‌రెడ్డి, మునిశేఖర్, పవన్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'ఇంటింటికీ వైసిపి'

అనంతపురం : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి చేపట్టిన ఇంటింటికీ వైసిపి కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా నగరంలోని 35, 36వ డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ మరోసారి వైసిపిని ఆదరించాలని కోరారు. వైసిపి గెలిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రకాష్‌రెడ్డి, మహిళా నేతలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మర్తాడులో పట్టపగలే చోరీ

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

శింగనమల : గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పి.తులసమ్మ తన అన్న కూతురు పెళ్లిచూపులకు తిమ్మంపేట గ్రామానికి ఉదయం 11 గంటలకు వెళ్లింది. అనంతరం 1 గంటకు తిరిగి ఇంటికి వచ్చింది. కేవలం రెండు గంటల వ్యవధిలో గుర్తు తెలియని దుండగులు ఇంటికి తాళం పగలగొట్టి 40 తులాల బంగారం రూ.1.50లక్షలను దొంగలించినట్లు బాధితురాలు వాపోయింది. దొంగలు బురఖా వేసుకుని వచ్చి దొంగతనానికి పాల్పడి తిరిగి వెళ్తుండగా ఎదురింటి బాలిక గమనించినట్లు తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ వెంకట శివారెడ్డి, శింగనమల సీఐ శ్రీధర్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. నెలరోజుల వ్యవధిలోనే గ్రామంలో ఐదు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడం విశేషం. దీంతో గ్రామంలో వరుసగా జరుగుతున్న చోరీలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

పట్టుబడిన ట్రాక్టర్లు

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం భూపసముద్రం నుంచి రాయదుర్గం పట్టణానికి ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే బుధవారం కూడా రాయదుర్గం మండలం వేపరాళ్ల నుంచి కర్ణాటకకు ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని భూగర్భ, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు స్వాధీనం చేసినట్లు తెలిపారు.

టిడిపి ఎంపీ అభ్యర్థిని కలిసిన శ్రావణిశ్రీ

టిడిపి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణకు బహుమతి అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ కుటుంబం

శింగనమల : అనంతపురం ఎన్‌డిఎ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గురువారం జిల్లాకేంద్రంలోని వారి నివాసంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎంపీ అభ్యర్థిని కలిశారు. అంబికా లక్ష్మీనారాయణను కలిసిన వారిలో నాయకులు కాయల రమణయాదవ్, ఫక్రుద్దీన్, వీరాంజనేయులు, శివయ్య, జక్కుల రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

పుట్లూరు : అనంతపురం టిడిపి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ గురువారం తాడపత్రిలోని జెసి నివాసంలో మండల టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటు వేసి తనుతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల నాయకులను కోరారు. ఎంపీ అభ్యర్థిని కలిసిన వారిలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయుడు, రవి, నారాయణరెడ్డిపల్లి రామమునిరెడ్డి, రంగనాథ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, తిప్పారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి

ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు



పార్టీలోకి చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

ప్రజాశకి-రాయదుర్గం

రాష్ట్రంలోని వడ్డెరలను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామని రాయదుర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తెలిపారు. చెప్పారు. గురువారం రాయదుర్గంలో జయహో బిసి వడ్డెర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టు అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఎన్టీఆర్ కూడలిలోని సీతారామాంజనేయ సత్రం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన వడ్డెర్ల సమ్మేళనంలో పలువురు వడ్డెర్లు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా వాల్మీకి, బోయలు, వడ్డెర్లను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అయితే గత టిడిపి ప్రభుత్వ హయాంలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు. నిరంతరం కష్టపడి పనిచేసే వడ్డెర్లను కూడా ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. వాల్మీకులు, వడ్డెర్లను 60 ఏళ్ల క్రితమే ఎస్టీల జాబితాలో చేర్చాల్సి ఉండగా రాజకీయ కారణాల వల్ల ఆచరణకు నోచుకోలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వడ్డెర్లకు తగిన న్యాయం చేస్తామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమ్మేళనంలో వడ్డెర్ల సంఘం నాయకుడు గోవింద, జనసేన నాయకులు మంజునాథ్ గౌడ్, టిడిపి నాయకులు నాగరాజు, శంకర్, పురుషోత్తం, కాలవ సన్నన్న, హనుమంతురెడ్డి, టిడిపి, జనసేన, వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో మిరప రైతు మృతి

పామిడి : మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన మిరప రైతు నాగరాజు (40) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నాగరాను తన సొంత పొలం 2.97 ఎకరాలతోపాటు మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి నిమిత్తం దాదాపు రూ.20 లక్షల వరకూ అప్పులు చేశాడు. అయితే పంట చేతికి అందిన తర్వాత ధర పతనమైంది. దీంతో కనీసం పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు కూడా తీరని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో అప్పుల బాధతో బాధపడుతున్న నాగరాజుకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి నొప్పి వచ్చింది. వెంటనే పామిడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య మారెమ్మ, కుమారుడు మురళీ ఉన్నారు.

దళిత ద్రోహులు 'మందకృష్ణ, కాలవ'

రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి ఎస్సీ సెల్ నాయకులు

రాయదుర్గం : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు దళిత ద్రోహులని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు విమర్శించారు. గురువారం పట్టణంలోని మెట్టు గోవిందరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ పాతికేళ్లుగా ఎస్సీల వర్గీకరణ పేరుతో స్వప్రయోజనాలకు పాల్పడుతున్నాడన్నారు. దళిత జాతికి ఏం చేశారని టిడిపి, బిజెపికి మద్దతు ఇచ్చారో మందకృష్ణ చెప్పాలన్నారు. కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో దళితులపై దాడులు గతంలో చేయించింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. ఇండేన్ గ్యాస్ మేనేజర్ కృష్ణ ఒక్కరే బుధవారం టిడిపిలో చేరితే 190 దళిత కుటుంబాలు చేరినట్లు చెప్పడం పచ్చి అబద్ధం చెప్పారన్నారు. దళితుల సంక్షేమం ఒక్క జగన్‌తోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు బేలోడు రామాంజనేయులు, ఊడేగోళం గోవిందప్ప, మున్సిపల్ వార్డు సభ్యుడు వన్నూరుస్వామి, నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

టిడిపితోనే అన్నివిధాలా అభివృద్ధి

నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గుమ్మనూరు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

టిడిపితోనే రాష్ట్రంతో పాటు నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యరి గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. పామిడి మండలంలోని పాళ్యం, పాళ్యం ఎగువతండా, దిగువతండా, ఎద్దులపల్లి, వంకరాజుకాలువ, నెమలపల్లి, పామిడి, కొండాపురం, కాలాపురం, జి.కొట్టాల, దేవరపల్లి, ఓబుళాపురం, ఖాదర్‌పేట, అనుంపల్లి, కట్టకిందపల్లి, కండ్లపల్లి, దుబ్బశానిపల్లి, అప్పాజీపేట పంచాయతీలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు గురువారం పామిడిలోని టిడిపి కార్యాలయంలో గుమ్మనూరు శ్రీనివాసులును కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఆర్.రమేష్, ముసలిరెడ్డి, స్టేషన్ సుంకిరెడ్డి, సుంకప్ప, బొమ్మా మోహన్, కొట్టం మాలిక్, నల్లబోతుల శీన, మాజీ స్టోర్ డీలర్ తిమ్మప్ప, గంపమల్లయ్య, పాల్యం బోయ శేఖర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబం నుంచి వచ్చా.. ఆదరించండి..

ఎం.వీరాంజనేయులు

ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

'పేద కుటుంబం నుంచి సిఎం జగనన్న దీవెనలతో ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వచ్చా.. ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించండి..' అంటూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం యల్లనూరు మండలం వేములపల్లి, నిట్టూరు, మేడికుర్తి, పెద్ద మల్లేపల్లి, పీఎం.కొండాపురం, తిరుమలాపురం గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ఎన్ని పార్టీల కలయికతో కలిసి వచ్చినా సీఎం జగనన్న చేసిన సంక్షేమ పాలన ముందు టీడీపీకి ఓటమి తప్పదన్నారు. రాష్ట్రాన్ని 14ఏళ్లు పాలించిన చంద్రబాబు ఒక్కరోజైనా పేదల కోసం ఆలోచన చేయలేదన్నారు. గతంలో 600 హామీలిచ్చి గాలికొదిలేసారని, ముఖ్యంగా మహిళలకు చంద్రబాబు ఎగ్గొట్టిన సున్నా వడ్డీ, రుణమాఫీ వంటి బకాయిలను జగనన్న తీర్చారని గుర్తు చేశారు. ఆయా పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి జగన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టిడిపికి బుద్ధి చెప్పాలి : వై.విశ్వ

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

అవినీతి లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను అందిస్తున్న సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించి టిడిపికి బుద్ధి చెప్పాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని యలగలవంక తండా, యలగలవంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి సిఎంను చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. నవరత్నాలు అమలు చేసి రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించారన్నారు. జగన్ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంటే చంద్రబాబు మాత్రం అడ్డుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా ఇంటింటికీ పథకాలు అందిస్తున్న వాలంటీర్లపై కుట్రలు చేయడం బాధాకరమన్నారు. కావున టిడిపికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరన్న, పెద్దన్న, రామాంజనేయులు, శివలింగప్ప, శ్రీనివాసులు, మచ్చన్న, శ్రీనివాసులు, నాగవేణి, శోభాబాయి, సురేష్, బాబూనాయక్, రమేష్‌నాయక్, చందూనాయక్, శంకర్‌నాయక్, తిమ్మరాజు, తిమ్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లేపాక్షి, మారుతి, బాబురెడ్డి పూల ప్రసాద్, రాము, తదితరులు పాల్గొన్నారు.

'నాపై ఫిర్యాదు తగదు'

రాయదుర్గం : రాయదుర్గం రైతు రక్షణ వేదిక కన్వీనర్‌గా పని చేస్తున్న తనపై రెండు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం తగదని గౌని ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. నియోజకవర్గంలో రైతులు, వ్యవసాయ అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పంట సాగుకు ఏం చర్యలు చేపడతారో మేనిఫెస్టోలో ప్రకటించాలని తాను కోరగా ఒక పార్టీకి మద్దతు ఇస్తున్నానని ఒకరు, ప్రత్యర్థి పార్టీకి మద్దతు ఇస్తున్నాననిమరొకరు తనపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. తాను ఏ పార్టీకి మద్దతుగా పనిచేయడం లేదన్నారు. కేవలం నియోజకవర్గంలో రైతాంగం, వ్యవసాయం సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. చేతనైతే రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యవసాయం, రైతాంగం అభివృద్ధికి ఏం చేస్తారో స్పష్టంగా సూచించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం : అమిలినేని

పార్టీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. గురువారం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో సుమారు 40 కుటుంబాలు వైసీపీ నుంచి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన రంగారెడ్డి, ఆదిరెడ్డి, గంగిరెడ్డి, మారుతిరెడ్డితోపాటు బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన పలువురికి సురేంద్రబాబు కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. కొన్నేళ్లుగా కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధి కోసం వేచి చూస్తున్నానని, ఆ సమయం నేడు ఆసన్నమైందన్నారు. ప్రజలు పార్టీ శ్రేణుల సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చాకలి వెంకటేశులు, మల్లికార్జున, ఎర్రిస్వామి, బూదప్ప, ఎర్రగుడి, తిమ్మప్ప, దొడగట్ట వెంకటేష్, రామాంజనేయులురెడ్డి, రేణుక, శకుంతలమ్మ, తిమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ తమ విద్యార్థి ఒక అమ్మాయి తండ్రి వర్ధంఇ సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. దాదాపు 200 మందికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబుళపతి, నబిరసూల్, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యూరియాను పరిశీలిస్తున్న ఎడిఎ ఎం.రవి

జిల్లాకు చేరిన 832 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం : కోరమాండల్ కంపెనీకి చెందిన 832 మెట్రిక్ టన్నుల యూరియా గురువారం జిల్లాలోని ప్రసన్నాయపట్టి రైల్వే రేఖ్ పాయింట్‌కు చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఏ ఎం.రవి తెలిపారు. ఈమేరకు స్టాకును పరిశీలించి కలెక్టర్ సూచన మేరకు 806 మెట్రిక్ టన్నుల యూరియా ప్రయివేట్ డీలర్లకు, 26 మెట్రిక్ టన్నుల యూరియా కంపెనీ గోదాముల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు.

పింఛను పంపిణీ పరిశీలన

నార్పలలో పింఛన్‌కు వచ్చిన వృద్ధులు

నార్పల : మండలంలో వివిధ సచివాలయాల పరిధిలో చేపట్టిన పింఛన్ పంపిణీని ఎంపిడిఒ రాముడు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా నార్పల-1, 2, 4వ, బొందలవాడ, పప్పూరు, కేసేపల్లి తదితర సచివాలయాల్లో పంఇఛన్ పంపిణీని పరిశీలించి ఏర్పాట్లపై ఆరాతీశారు. ఒకటి, రెండు కేంద్రాల్లో పంపిణీ ఇబ్బందికరంగా ఉండడంతో సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి ఇబ్బందులను తొలగించుకోవాలని సూచించారు. 4 గంటల సమయానికి మండలవ్యాప్తంగా 90 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు.

పుట్లూరు : మండలంలో చేపట్టిన పింఛన్ పంపిణీని ఎంపిడిఒ దస్తగిరి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా పుట్లూరు, మడ్డిపల్లి, కుమ్మనమల తదితర పంచాయతీలో పింఛన్ల పంపిణీ చేసే వద్ద కుర్చీలు, సేమియానాలు, సౌకర్యాలపై ఆరాతీశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పింఛన్లను పంపిణీ చేయాలని కోరారు.

బెలుగుప్ప : మండలంలోని బెలుగుప్ప-1, 2, ఎర్రగుడి, ఆవులెన్న, శీర్పి, విరుపాపురం గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పింఛన్ పంపిణీని ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ హరినాథరావు గురువారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 86.95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వందశాతం పన్ను వసూళ్లే లక్ష్యం

మాట్లాడుతున్న శింగనమ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సునీత

పుట్లూరు : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శింగనమల మార్కెట్ యార్డు నిర్దేశించిన పన్ను లక్షసాధన 100 శాతంపైనే సాధించినట్లు మార్కెట్ యార్డు కమిటీ ఛైర్‌పర్సన్ భూమిరెడ్డి గారి సునీత తెలిపారు. గురువారం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డు పరిధిలోని వివిధ రకాల పన్ను రూ.75 లక్షల లక్ష్యాన్ని ఎంచుకుని 101.22 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన చిన్న రైతులు, వ్యాపారులు, మార్కెట్ యార్డు సెక్రటరీ, అధికారులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే సంవత్సరంలో మార్కెట్ యార్డుకు మరింత లాభం చేకూర్చే విధంగా పని చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

బొమ్మనహాల్ : మండలంలోని కృష్ణాపురానికి చెందిన పలువురు వైసిపి నాయకులు గురువారం టిడిపిలో చేరారు. వీరికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందన్నారు. సిఎం జగన్ రాక్షసపాలన సాగిస్తున్నారన్నారు. నిరంకుశ పాలన ప్రజలు విసిగి వేసారి టిడిపిలోకి వస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ డీలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో పెన్నహోబిలం

హైమాక్స్ లైట్ల వద్ద నాయకులు, అధికారులు

ఉరవకొండ : నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన పెన్నఅహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం హైమాక్స్ లైట్లతో వెలిగిపోతోంది. అనంతపురం కెనరా బ్యాంకు సహకారంతో రూ.1.71 లక్షలు వెచ్చించి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో ఆలయ తూర్పు, ఉత్తర ముఖద్వారాల వైపు వెలుగు సంతరించుకుంది. హైమాక్స్ లైట్లు ఏర్పాటుతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మాట్లాడుతూ ఆలయం చుట్టూ మరో మూడు చోట్ల హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ఏర్పాటుతో రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. లైట్లు ఏర్పాటుకు సహకరించిన కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న దృశ్యం

నార్పల : మండల కేంద్రంలోని సత్యసాయి అనాథాశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. మండల కేంద్రానికి చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త బూసి వెంకటరాముడు వర్ధంతిని పురస్కరించుకుని కుమారులు జయరామ్, అశోక్, దిలీప్ అన్నదానానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతల స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానము, కూడేరు గ్రామము మరియు మండలం అనంతపురము జిల్లా.

పై దేవస్థానము నందు 2024 సంవత్సరము ఏప్రిల్ నెల యందు 17/04/2024 నుండి 25/04/2024 వరకు జరుగు బ్రహ్మోత్సవముల సందర్భముగా ఈ క్రింద తెలిపిన పనులకు గాను కొటేషన్లను ఆహ్వానించడమైనది. 1.సున్నంపూతలు, 2.విద్యుత్ దీపాలంకరణ, 3.చలువ పందిర్లు,4.ప్రింటింగు, 5.ఫ్లవర్ డెకరేషన్, 6.రథం రిపేరి, 7.పెయింటింగ్స్, 8.దేవాలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలం, రథంతిరుగు రస్తా, రోడ్డుకు ఇరువైపుల వున్న ముళ్ళ చెట్లను తొలగించుట, జెసిబితో క్లీనింగు చేయుటకు, తదితర పనులకు ఆసక్తి గలవారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 5 రోజులలోగా పంపవలసినదిగా కోరడమైనది.

ఆలయ కమిటి ఛైర్మెన్ & సభ్యులు

**కార్యనిర్వహణాధికారి
శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానము,
కూడేరు, అనంతపురం జిల్లా.**